

ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. అక్రమాల ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలు, ఇబ్బందులు ఏర్పడితే తమకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 08572-299509 ఏర్పాటు చేశామని చెప్పారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, టిప్పర్ యజమానులు, వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

'పిఎం విశ్వకర్మ యోజన' రిజిస్ట్రేషన్ చేసుకోండి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పిఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిపొందేందుకు గ్రామ, వార్డ్ సచివాలయం, సియస్‌సి సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం విశ్వకర్మ యోజన ప్రారంభించిందని, కేవలం 5శాతం వడ్డీకే రూ.3లక్షల వరకు లోన్ అందించే ఈ పథకం 2023 సెప్టెంబర్ 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమానితులపై సమాచారం ఇవ్వండి: ఎస్పీ



ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్ : అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పి మణింఠ చందోలు ప్రజలకు సూచించారు. శనివారం అందుకు సంబంధించి ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం వంటి పరిస్థితిల్లో వెంటనే ఆలస్యం చేయకుండా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 100, 112కు సంప్రదించాలన్నారు. చిత్తూరు పోలీస్ వాట్సప్ నెంబరు 9440900005కు తక్షణమై సమాచారం అందించవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ మెలగాలని సూచించారు.

డీఎస్పీగా సాయినాథ్ బాధ్యతలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు డిఎస్పిగా సాయినాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరు మహిళా స్టేషన్ డిఎస్పిగా ఉంటూ ఇక్కడకు బదిలీ అయ్యారు. కాగా శనివారం చిత్తూరులో బాధ్యతలు చేపట్టారు.

బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన దంపతులు మృతి



తీవ్ర గాయాలతో ఖాదర్‌బాషా

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం పంచాయతీ మారేడు పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి బానసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులు ఖాదర్బాషా(45) అతని భార్య రిహానా(35) తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకలు తెలిపారు. వివరాలు.. మారేడుపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి ప్రభుత్వాలు అనుమతులు లేకుండా బాణా సంచాలు తయారు చేస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా బాణా సంచా పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమై భార్యాభర్తలిద్దరూ మట్టి పిల్లల కింద చిక్కుకున్నారు. గుర్తించిన స్థానికులు వారిని బయటకు తీసి 108వాహనం ద్వారా పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపతకి తరలించారు. అక్కడుండి తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి సమయంలో చికిత్స పొందుతూ ఖాదర్ బాషా చనిపోగా రెండు గంటల తర్వాత భార్య చనిపోయిందని కుటుంబీకులు చెప్పారు. వీరితో పాటు వారి కొడుకు హమీద్(4) ప్రమాదం బయటపడ్డాడు. ఆ ఇంటి పక్కన ఉన్న రైతు ఆంజనేయులుకు చెందిన రెండు పాడి ఆవులు, దూడలు మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై గ్రామస్తులు మాట్లాడుతూ గత 15సంవత్సరాలుగా ఈ ఇంటిలో బాణా సంచాల తయారు చేసి అమ్ముకుంటున్నారని అనేక సార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. శుక్రవారం అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజ ఉండడంతో గ్రామస్తులందరూ గుడి దగ్గర ఉండిపోవడంతో ఘటన సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో మరింత మంది ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా అగ్నిమాపక అధికారి సి.పెద్దిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కానీ, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో వ్యాపార స్థలాల్లో బాణ సంచాలు, టపాకాయలు తయారు చేసుకున్న అమ్ముతున్న వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ ప్రసాద్ మండల పరిధిలోని బాణ సంచ తయారీ కేంద్రాలను గోడౌన్లను తనిఖీ చేసి సీజ్ చేశారు.



పేలుడు ప్రభావంతో ధ్వంసమైన ఇల్లు

రెండు కీలక నిర్ణయాలు.. ప్రజా ప్రయోజనమెంత.!

ప్రజా దృష్టి


ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:
రాష్ట్ర ప్రభుత్వం ఇసుక నూతన విధానం, గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై ఒకే రోజు జిల్లా వ్యాప్తతంగా 700గ్రామ పంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజా అభిప్రాయం మేరకు ఆయా పంచాయితీల్లో చేపట్టాల్సిన పనులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించబడ్డాయి. ఇసుక నూతన విధానంలో అక్రమ ఇసుక తరలింపుపై కఠిన చర్యలు తీసుకోన్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో గృహ నిర్మాణాల కోసం సమీపంలోని చిన్న చిన్న వాగులు, వంకల నుంచి ఇసుక తరలింపుపై ఏలాంటి ఆంక్షలు లేవని అక్రమ ఇసుక నిల్వలు, ప్రభుత్వం నిర్ణయించి ధరల కంటే అధికంగా ఇసుక రవాణా పేరుతో వసూలు చేసే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రస్తుతానికి మూడు డిపోల్లో 1,84,519 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. 74 అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. జిఎస్‌టి, సీనరేజ్, జెసిబి లోడింగ్ చార్జెస్, ఎన్విరాన్మెంట్ టాక్స్ కలిపి ఒక మెట్రిక్ టన్నుకు రూ.155 చెల్లించవలసి ఉంటుంది.

ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణా అరికట్టేలా తీసుకొచ్చిన నూతన ఇసుక విధానం ఇసుక అక్రమ రవాణా అరికట్టి పేద, మధ్యతరగతి స్వంత ఇంటి కళలు నెరవేరేందుకు తొడ్పాటును అందిస్తాయా అనే విషయం వేచిచూడాలి. అలాగే గ్రామ స్వరాజ్యం గ్రామీణ ప్రాంతాల అభివద్ధి గ్రామీణవాసులే నిర్ణయించుకొనేలా ఒకే రోజు ఈనెల 23వ తేది 700గ్రామ పంచాయితీల్లో జాతీయ ఉపాధిహామీ పథకానికి సంబంధించి 91.30కోట్లతో 1,407పనులకు ఆమోదించబడ్డాయి. ఈ గ్రామ సభలలో భాగంగా మరుగుదొడ్లు, విద్యుత్, కుళాయి, వంటగ్యాస్ కనెక్షన్లు, మురుగునీరు-ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంటు రహదారులు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మండల కేంద్రాలకు లింక్ రోడ్లు, ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివద్ధికి సదుపాయాలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి సహకారం అందించాలంటూ గ్రామీణ వాసులు గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో 2,55,153 ఉపాధి జాబ్ కార్డులున్నాయి. ఇందులో 1,55,632 మంది ఉపాధి పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాలు 1,271మాత్రమే ఉపాధి హామీ చట్టం ప్రకాచం జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి రెండు లక్షల జాబ్‌కార్డుదారుల, 1,55వేల మందికి పైగా పనులకు హాజరౌతున్న ఉపాధి కూలీలుంటే కేవలం 1,271కుటుంబాలు మాత్రమే వందరోజులు పని చేసినవారున్నాంటే.. జాబ్ కార్డుదార్లందరికీ పని కల్పించడంపై అధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది. సగటు వేతనం రూ.200-250 మించి అందడంలే.. రోజుకు సగటు వేతనం కనీసం రూ.400 నుంచి రూ.450 అందేలా పనులు రూపొందించడం, పని ప్రదేశాల్లో మంచి నీరు, నీడ కోసం షెడ్లు, ప్రధమిక చికిత్స కిట్లు, పని ముట్లు అందించాల్సిన అసరముంది. గ్రామ ప్రజల ఆమోదంతో గ్రామ సభల్లో నిర్ణయించిన మేరకు పనులు చేపట్టడం ద్వారా తమ అభివృద్ధి కోసం గ్రామీణులంతా కలసి నిర్ణయించిన పనులు కావడంతో ఆ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ఉత్సహంగా పనులు చేయడంతో పాటు గ్రామ అభివృద్ధికి తోడ్పతాయాని గ్రామీణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్వరాజ్యం పేరుతో గ్రామీణులతో గ్రామ సభలు నిర్వహించిన ప్రభుత్వం ఆదే స్థాయిలో వారి ఆక్షాంక్షలు నెరవేర్చేలా పనులు చేస్తుందని ఆశిద్దాం.

స్విమ్స్‌లో వైద్యురాలిపై రోగి దాడి

రక్షణ కల్పించాలంటూ డాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్విమ్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా డాక్టర్ పై ఓ రోగి దాడి చేసే గాయపరిచిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. దీంతో వైద్యులందరూ విధులు బహిష్కరించి అత్యవసర విభాగం ఎదుట ధర్నా చేపట్టారు. వైద్యుల సమాచారం మేరకు స్విమ్స్ అత్యవసర విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా వైద్యురాలిపై, అక్కడే డిహైడ్రేషన్ సెంటర్లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి హఠాత్తుగా పరిగెత్తుకుంటూ వచ్చి వైద్యురాలు జుట్టు పట్టుకొని, పక్కనే ఉన్న టేబుల్ కేసి బాదాడు. ఈ ఘటనలో వైద్యురాలి తలకి గాయమై రక్తస్రామయింది. పక్కనే ఉన్న వైద్యులు సిబ్బంది అప్రమత్తమై వెంటనే రోగిని పట్టుకుని, వైద్యురాలుని అతని భారి నుంచి విడదీశారు. ఈ ఘటనతో కోపద్రోహులైన వైద్యులు స్విమ్స్, శ్రీ పద్మావతి మహిళా కళాశాల వైద్యశాలలో విధులు బహిష్కరించి, అత్యవసర విభాగానికి చేరుకొని, ప్రధాన ద్వారం ముందు బయట నుంచి ధర్నా చేపట్టారు. కోల్‌కత్తా జీఆర్ కార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా స్విమ్స్, రుయా ఆసుపత్రి జూనియర్ వైద్యులు 12 రోజులు పాటు నిరసన వ్యక్తం చేసి, శుక్రవారం విరామం ప్రకటించారు. ఆ మరుసటి రోజే స్విమ్స్‌లో ఈ ఘటనతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యురాలి మాట్లాడుతూ వైద్యులు, వైద్యురాళ్లపై దాడి నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం హాస్పిటల్‌లో వైద్యురాలికి జరిగిన అవమానం గురించి ఫిర్యాదు చేసిన, ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. మానసిక రోగులు, బీపీ రోగులు, ఇతర రోగుల మధ్య తాము నిరంతరం విధులు నిర్వహించాలని, వారు పరిస్థితి సరిగా లేదని చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే, దాడుల కొనసాగుతూనే ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ వైద్యులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా తమకు న్యాయం చేయాలని గట్టిగా నినాదించారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుకు, ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. వెంటనే బహిర్గపరచాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేసేందుకు ఆయన వెనుతిరిగి వెళ్ళిపోయారు. విషయం తెలుసుకున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ అత్యవసర విభాగానికి చేరుకొని, అక్కడి అధికారులను జరిగిన పరిణామాలు గురించి అడిగి తెలుసుకున్నారు. స్విమ్స్ అధికారుల సమాచారంతో అలిపిరి పోలీసులు అక్కడికి వైద్యాధికారులతో చర్చించారు. టిటిడి ఈవో స్విమ్స్‌కు వచ్చి తమకు రాతపూర్వకంగా హామీ ఇచ్చే వరకు ధర్నా కొనసాగిస్తామని వైద్యులు భీస్మించుకున్నారు. వైద్యులు సుమారు నాలుగు గంటలు పైగా ధర్నాను కొనసాగించడంతో రోగులు కాస్త అసౌకర్యానికి గురయ్యారు. డాక్టర్ల ఆందోళన రాత్రి కూడా కొనసాగుతోంది.



స్విమ్స్ అత్యవసర విభాగం ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు

దివ్య దర్శనం టోకెన్ల జారీ కేంద్రంలో ఈవో తనిఖీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:
తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో దివ్య దర్శనం, ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ కేంద్రాన్ని శనివారం టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి పరిశీలించారు. అలిపిరి వద్ద భక్తులకు ఇది వరకు జారీ చేస్తున్న దివ్యదర్శనం టోకెన్లను పునఃప్రారంభించేందుకు సాధ్యసాధ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ ప్రక్రియను, క్యూ లైన్లను, ఎస్వీబిసి మాస్టర్ కంట్రోల్ రూమ్‌ను, ఎస్వీబిసి పాత పరిపాలన భవనాన్ని పరిశీలించారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా టోకెన్లు జారీ చేయడానికి శాశ్వత క్యూలైన్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరువాత అలిపిరి పాదాల మండపం వద్ద ఇదివరకు దివ్య దర్శనం టోకెన్ల జారీ కేంద్రాన్ని, టిటిడి జలప్రసాదాన్ని, లగేజీ కౌంటర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈవో వెంట జేఈఓ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో శ్రీధర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

'స్వామి మా మీద దయ చూపు..'

హోమంతో నిరసన



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి మెట్లు వ్యాపారస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం వెంకటేశ్వర స్వామి పటాలు నెత్తిన పెట్టుకొని హోమం చేయడం జరిగింది. గోవిందా గోవిందా మా సమస్యను పరిష్కరించండి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడుతూ నిరసన దీక్షలు చేపట్టి నేటికి నాలుగు రోజులు పూర్తవుతున్న టిటిడి యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అనేక సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదన్నారు. రాత్రిపగలు నిరసన దీక్షలో కూర్చొని దోమల లెక్క చేయకుండా అనారోగ్యానికి గురవుతున్నా చిరు వ్యాపారస్తుల గురించి టీటీడీ యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. శ్రీవారి మెట్లు మార్గంలో నడుస్తున్న భక్తులకు అండదండలుగా ఉన్న శ్రీవారి మెట్లు వ్యాపారస్తులను దించేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. గత 20 సంవత్సరాల నుంచి ఆ మార్గంలో వెళుతున్న భక్తులకు అనేక రూపాలుగా సేవలు చేయడం జరిగిందని కాబట్టి తమ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మళ్లీ సోను, మొగిలప్ప రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:
రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లబిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదానీ, షిరిడి సాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టిందన్నారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకున్నట్లు ఆయన ఆరోపించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందని గుర్తు చేశారు. హైకోర్టులో పిటీషన్లు వేశారని చెప్పారు. నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నదన్నారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాలలోను మీటర్లు ఏర్పాటు చేసి తదుపరి నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నట్లు ఆయన చెప్పారు. మొదటి దశలో వ్యవసాయం పంపు సెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరుపెట్టే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యధిక పంపు సెట్లు ఉండగా నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్నిబట్టి అదనపు చార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయటం తదితర రూపాల్లో భారం పడుతుందన్నారు. వేలాది కోట్ల ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం గతంలో వ్యతిరేకించిన మీటర్లనే కొనసాగించడం వాగ్దాన భంగమే అవుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈస్మార్ట్ మీటర్లను రుద్దుతోందని, వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఆదాని, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, ఏర్పాటు చేసిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను, ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

పార్కు సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

- కమిషనర్ డాక్టర్ జె.అరుణ



పార్కు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని మిట్టూరు మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కు జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పార్కులో జరుగుతున్న పనులను కమిషనర్ తనిఖీ చేశారు. పార్కులో పచ్చదనం మరింత పెంచేలా ఎక్కువ మొక్కలు నాటాలని, నడకదారులు మరింత పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కులో లైటింగ్ సామర్థ్యం పెంచేలా అధిక సామర్థ్యం ఉన్న లైట్లు వేయాలన్నారు. పార్కులో ఇప్పటికే ఏర్పాటు చేసిన పిల్లల ఆట వస్తువులను పరిశీలించారు. మిగిలిన ఆట వస్తువులను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీలకు పెయింటింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పార్కులో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

'చిత్తశుద్ధితో పనిచేస్తూ మంచి పేరు తేవాలి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కర్నూల్ రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్ కుమార్ హోంగార్డ్ యూనిట్లను పరిశీలన నిమిత్తం చిత్తూరు విచ్చేశారు. శనివారం చిత్తూరు ఆర్మ్డ్ రిజర్వు ఆఫీస్‌లో హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించి దర్బార్ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఆక్సిస్ బ్యాంకు వారి ప్రయోజనాల గురించి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లాలో శాంతి భద్రతల కోసం 403మంది హోంగార్డులు విధులను నిర్వహిస్తున్నాట్లు చెప్పారు. హోంగార్డులు పోలీసు వారితో సమానంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను అరికట్టడంలో వెన్నుదన్నుగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, పండుగలు, విఐపి, వివిఐపి పర్యటనల సందర్భంలో పోలీసులకు వారి సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఇదే విధంగా హోంగార్డులు తమ సేవల్ని చిత్తశుద్ధితో నిర్వహించి జిల్లా పోలీసు శాఖకి మంచి పేరు తేవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రానున్న రోజుల్లో మరిన్ని వైద్య సేవలు

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి-శాంతిపురం: ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి రోగులను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆప్యాయంగా పలకరిస్తూ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గ ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన నేత సీఎం చంద్రబాబు అని కొనియాడారు. 8సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి రాష్ట్రానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటారన్నారు. గతంలో నియోజకవర్గ రైతులకు పాడి ఆవులు ఇస్తే అందరూ హేళన చేశారని ఇప్పుడు జిల్లాలో పాల ఉత్పత్తిలో కుప్పం ప్రథమ స్థానంలో ఉందన్నారు. కుప్పం లాంటి మారుమూల గ్రామంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు కల్పిస్తామన్నారు. హెల్త్ క్యాంప్ 576 మందిని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ నాయుడు, డీఎంహెచ్వో ప్రభావతి, డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీనివాస్, జిల్లా ఇమేనేజెస్ ఆఫీసర్ హనుమంతరావు, తహశీల్దార్ జి.శివయ్య, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాళ్ళబుదుగూరులో

మండలంలోని రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాళ్ళబూదుగూరు ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ శివకుమారి, డాక్టర్ ఉషారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, కడా పీడీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయన్నారు. చిత్తూరు అపోలో ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.



కంటి పరీక్షల శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

శ్రీసిటీని సందర్శించిన డిపి ఐఐటి జాయింట్ సెక్రటరీ

ఐఆర్ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) జాయింట్ సెక్రటరీ సంజీవ్ ఐఆర్ఎస్ శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రముఖ ఎయిర్ కండీషనర్ బ్రాండ్ల ఉనికి, బలమైన సరఫరా గొలుసుతో దేశంలో అగ్రగామి కేంద్రంగా శ్రీసిటీ వేగంగా ఎదుగుతోందని చెప్పారు. శ్రీసిటీ అత్యుత్తమ మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రశంసించిన సంజీవ్, ఇది ఆత్మనిర్భర్ భారత్ చొరవకు చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. శ్రీసిటీ పర్యావరణ స్నేహపూర్వక విధానాలను కూడా ప్రశంసించారు. ఇవి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు, సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కఠినమైన పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూ పర్యావరణాన్ని రక్షించేందుకు రూపొందించబడ్డాయని తెలిపారు. తన సందర్శనలో భాగంగా డైకిన్, అంబర్, ఈ పాక్, బ్లూస్టార్, హవెల్స్, మాగ్నమ్ ఎయిర్ కండీషనర్ తయారీ కేంద్రాలను సందర్శించారు. కంపెనీల కార్యకలాపాలను పరిశీలించారు.

ఐఆర్ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం..

ఇండియన్ రబ్బరు మెటీరియల్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఐఆర్ఎంఆర్ఐ)కు సంబందించిన రబ్బరు, టైర్ రీసెర్చ్ ల్యాబ్ ఆర్‌టిఆర్ఎల్‌ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంజీవ్ పాల్గొన్నారు. ఐఆర్ ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఐఆర్ఎమ్ఆర్ఐ బృందాన్ని అభినందిస్తూ, రబ్బరు, టైర్ రీసెర్చ్ ల్యాబ్ స్థాపన శ్రీసిటీ సహజ సిద్ధమైన వ్యవస్థను బలపరిచే గొప్ప ఆస్తిగా మారుతుందని, ఈ ప్రాంతంలోని ఆటోమోటివ్, టైర్ , రబ్బరు తయారీ పరిశ్రమలకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.

ప్రారంభమెప్పుడో..!



● ప్రభుత్వ భవనాలకు వీడని రాజకీయ గ్రహణం ● ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పల్లె ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం సచివాలయ, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లీనిక్ వంటి వ్యవస్థలను రూపొందించింది. ఆయా గ్రామాల్లో ప్రజలకు సౌకర్యంగా ఉండేదుకు ఆధునిక సౌకర్యాలతో భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అయితే కొన్ని భవనాలు పూర్తై ప్రారంభించగా మరికొన్ని పూర్తైనా ఆరంభానికి నోచుకోక నేతల రిబ్బన్ కటింగ్ కోసం ఎదురుచూస్తున్నాయి. ఇంకొన్ని సకాలంలో నిధులు అందక కాంట్రాక్టర్‌లు అర్ధాంతరంగా ఆపేశారు. ఫలితంగా తత్కాలిక భవనాల్లో సచివాలయ, వైద్య, వ్యవసాయ శాఖ ఉద్యోగులు కాలం వెల్లదీస్తున్నారు. ఇరుకు గదుల్లోనే ఉంటూ అరకొరా సౌకర్యాల నడుమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు అవసరాల కోసం వస్తున్న ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని గ్రామీణులు వాపోతున్నారు. పూర్తైన భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోక రాజకీయ గ్రహణం పట్టుకుందని విమర్శలు గుప్పిస్తున్నారు. రాజకీయాలు పక్కన పెట్టి అధునాతన సౌకర్యాలతో నిర్మించిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఆమేరకు ఉన్నతాధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పూర్తి కాని భవనాలకు నిధులు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



ఉన్నతాధికారులకు నివేదించి.. వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. నల్లవెంగనపల్లిలో భవనాలు పూర్తై ప్రారంభం కాలేదన్నది మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల మేరకు అందుబాటులోకి తెస్తాం.

- పురుషోత్తం, ఈవోఆర్‌డీ, వెదురుకుప్పం

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం: మండలంలోని ఆరిమాకు లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శనివారం జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60సంవత్సరాల పైబడిన వారు, డయాబెటిక్ పేషెంట్లు , పొగ తాగే వారు, గత ఐదు సంవత్సరాలలో క్షయ వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబ సభ్యులకు అడల్ట్ బిసిసి వ్యాక్సినేషన్ కచ్చితంగా వేయవలసిందిగా సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ వ్యాధినిరోదక టీకా వేసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల గురించి ఆరా తీశారు. వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరీ, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

ప్రజాశక్తి-విజయపురం: మండలం ఈవోపీఆర్‌డీ సరేంద్రకుమార్‌ను వైసీపీ మండల కార్యదర్శి, లిగల్ అడ్వాైజర్ బాబు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కరం కోసం నిత్యం ప్రజలకు అందుబాటు ఉండాలని కోరారు. వారి సేవ తమకు ఎంతో అవసరమన్నారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధు సూదన్ రెడ్డి

ఉద్యాన శాఖ జిల్లా అధికారి మధు సూదన్ రెడ్డి

ప్రజాశక్తి-గుడిపల్లి: రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి మధు సూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో 18 పంచాయతీల రైతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయంలో డ్రిప్ విధానాన్ని అనుసరించడం వల్ల అధిక దిగుబడులు సాధించడంతో పాటు నీటి ఆదా చేసుకోవచ్చునన్నారు. తద్వారా శ్రమ తగ్గుతుందని, రైతులు అవగాహనతో డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా ప్రభుత్వం 90శాతం రాయితీపై డ్రిప్‌లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 15వ తేదీ లోపు డ్రిప్ అవసరమున్న ప్రతి రైతూ ఆర్‌బికేల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్‌కి సంబంధించిన 14కంపెనీల ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మకు ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం అత్యంత వైభవంగా ఆలయ అధ్యక్షులు కె.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం అర్చకులు గణపతి పూజ పరివార దేవత హోమం, మూర్తి హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్ళే, పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమంలో ఆర్.రాజశేఖర్, రాజేష్, భూపాల్ తదితరులు సహాయ సహకారాలు అందించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా: రిటైర్డ్ టీచర్



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: డీఎం పురం ఉన్నత పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని రిటైర్డ్ టీచర్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం పాఠశాల హెచ్ఎం కేశవులు, ఉపాధ్యాయుల సమక్షంలో రూ.5వేలు విరాళం అందించారు. పాఠశాల ఆవరణలో గల గాంధీజీ, నెహ్రూ, సర్వేపల్లి, అబ్దుల్ కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, అంబేద్కర్, భారతదేశం, ఆంధ్రప్రదేశ్ గ్లోబు సిమెంట్ నమూనా విగ్రహాలు తయారు చేసి ప్రతిష్ఠించిన సందర్భంగా సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు సరస్వతి, మాలతి, సుమతీ, సుబ్రమణ్యం రెడ్డి, చిన్నయ్య చెట్టి, వెంకటరమణయ్య, డిల్లి బాబు, తిరుమల రాజు, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

తులసినాథంకు జాతీయ పురస్కారం



ప్రజాశక్తి- గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు తులసినాధం నాయుడు గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికైయ్యారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి నిర్వాహకులు బి.కృష్ణ ఆహ్వానం పంపినట్లు తులసినాదం తెలిపారు. ఈ నెల 29న విజయవాడలో జరిగే తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నట్లు ఆయన శనివారం విలేకరులకు చెప్పారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని సిడి కండిగ గ్రామానికి చెందిన దాసరి గణేష్ వనజ కుమార్తె దాసరి లోహిత్య పదవ పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం, సీట్లు, పండ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది వృద్ధులకు అన్నదానం చేయడం జరుగుతుందని గణేష్ పేర్కొన్నారు. వృద్ధులు తల్లిదండ్రులతో సమానంగా చూసుకోవాలన్నారు. చిన్నారి లహిత్యాను వృద్ధులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందస్వామి, చిన్న కుప్పారెడ్డి, నడిపి రెడ్డి, శ్రీనివాస యాదవ్, కె.రవి, కె.రమేష్, నరేష్, బాలకృష్ణ రెడ్డి, రాస్ పర్యవేక్షకులు ప్రకాష్ వృద్ధులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు కంటి వైద్య శిబిరాలు



ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా చేసిన సర్వేలో గుర్తించిన రోగులకు ఈ నెల 28, 30, 31 తేదీల్లో కంటి చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తహశీల్దారు బాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో అధికారులు, టిడిపి నేతలతో కంటి శిబిరాలు ఏర్పాటుపై సమీక్షించారు .ఈ నెల 28న వీర్నమల వీధిలాపురంలో, 30 ,31న రామకుప్పంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు .ఈ శిబిరాల్లో వెయ్యి రెండు వందల మందికి పైగా రోగులకు చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. రోగులకు తాగునీరు భోజన వసతి ..దాతల ద్వారా అందించాలని ఆయన కోరారు.

రేపు ఎంజీఎంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఎంజీఎం ఆస్పత్రిలో ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యంపేర్కొంది. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాతలు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 08578-2999972 లేదా 7288877300 లేదా 7288877308 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

అనధికార స్థలాలు కొనొద్దు: కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార, అనుమతి లేని ఫ్లాట్లు, స్థలాలు ఉన్నట్లు గుర్తించామని, వీటిని కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో అనధికారికంగా లేఔట్లను ఏర్పాటు చేసినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన లేఔట్లలో స్థలాలు, ఫ్లాట్లు కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేయబడవని తెలిపారు. ఇలాంటి స్థలాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం జరగదని, మౌలిక సదుపాయాలు కల్పన.. రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించబడవని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. పూర్తి వివరాలను నగరపాలక సంస్థ కార్యాలయం, నగరపాలక సంస్థ అధికారిక సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచినట్లు వివరించారు. ఇదే సమయంలో అనధికారికంగా లేఔట్లను వేసి స్థలాలను విక్రయిస్తున్న సంబంధిత స్థల యజమానుల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగి వాహనం నడిపిన 21మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తప్పతాగి వాహనం నడిపుతూ పట్టుబడ్డ కేసులో 21మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సిఐ నిత్యబాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. శుక్రవారం నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టామని తెలిపారు.అందులో తాగి వాహనం నడుపుతూ 21మంది పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో వారికి జడ్జ్ ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున 21మందికి రూ.2.10లక్షలు జరిమానా విధించినట్లు ఆయన వివరించారు. తప్పతాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బృందావన్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో బృందావన్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సంతపేటలోని బృందావన్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. శనివారం విద్యార్థులు బాలకృష్ణుడిగా, యశోదగా, గోపికలుగా వివిధ వేషధారణలో వచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఒ వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. పలువురు విద్యార్థులకు దాత రమణ విద్యా సామగ్రిని అందించారు.



అంతరిక్ష విశేషాలు తెలుసుకోవాలి

భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అంతరిక్ష విశేషాలు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు, భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా పిల్లలను తీర్చిదిద్దేందుకు భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తోందని భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి తెలిపారు. జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరు రమణమ్మ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వం ఫోటో ఎగ్జిబిషన్ 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు నుండి విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగం సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 23వ తేదీ భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తోందని తెలిపారు. మొదటి అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరులోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో మూడు రోజులపాటు ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా అంతరిక్ష విశేషాలు, శాస్త్రవేత్తల పరిశోధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తీసుకొచ్చి ప్రదర్శనను తిలకించాలని కోరారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే శాస్త్ర, సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని, అంతరిక్ష విశేషాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, అధ్యాప కులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టాస్క్ ఫోర్స్ వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం



టాస్క్ ఫోర్సు వెల్ఫేర్ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద వున్న టాస్క్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ క్యాంటీన్(ఫుడ్ కోర్ట్)ను శనివారం టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి ఎల్ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రత్యేక ఆపరేషన్‌తో బాగా పనిచేస్తున్నాయని కొనియాడారు. క్యాంటీన్ నిర్మాణానికి సహకరించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్ తో పాటు రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ అధికారులతో ఆపరేషన్లు సమర్థ వంతంగా నిర్వహించడానికి పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్ ఆర్ఐ లు కే.సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులు, కృపానంద, సీఐ సురేష్ కుమార్, ఎఫ్ ఆర్ ఓలు మురళీ కృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు అత్యుత్తమ గౌరవం

- ప్రముఖ ఎల్ఐసి ఏజెంట్ డివి గిరికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పేద బడుగు బలహీన వర్గాల వారికి నిస్వార్థంగా సామాజిక సేవ చేస్తున్న చిత్తూరు నగరానికి చెందిన ప్రముఖ ఎల్ఐసి ఏజెంట్ డివి గిరికి అత్యుత్తమ గౌరవం దక్కింది. ఆయన చేస్తున్న సేవలు గుర్తింపుగా బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ ఎల్ఐసి ఏజెంట్ డివి గిరికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం బెంగళూరు నగరంలోని భారత్ వర్చువల్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండర్ ఇన్ చీఫ్ ఆర్మీ కల్నల్ కౌశిక్ విశాల్, యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ ఎంఎం హమీద్, డీన్ టిఎన్ స్వామినాథన్ చేతుల మీదుగా గిరి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న డివి గిరి విలేకరులతో మాట్లాడుతూ.. కూడు, గుడ్డ, ఇల్లు లేని వారికి తాను గత 20సంవత్సరాలుగా తనకు తోచిన సాయం చేస్తున్నానని పేర్కొన్నారు. అదే క్రమంలో కరోనా మహమ్మారి ప్రబలిన సందర్భంలో వేలాది మందికి నెలల పాటు అన్నదానం చేసినట్లు వివరించారు. ఇలా తాను చేసిన సేవలను గుర్తించి తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక పైన తన సామాజిక కార్యక్రమాల్ని విస్తృతంగా కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. డివి గిరిని ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఎల్ఐసి కార్యాలయ అధికారులు, సిబ్బంది, సహచర ఏజెంట్లు తదితరులు అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న డివి గిరి

భాస్కర్ నాయుడుకి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పేద విద్యార్థులకు ఉచిత చదువు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించిన హార్వర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ భాస్కర్ నాయుడు సామాజిక సేవలకు గుర్తింపుగా బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం బెంగళూరు నగరంలోని భారత్ వర్చువల్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండర్ ఇన్ చీఫ్ ఆర్మీ కల్నల్ కౌశిక్ విశాల్, యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ ఎంఎం హమీద్, డీన్ టిఎన్ స్వామినాథన్ చేతుల మీదుగా భాస్కర్‌నాయుడు గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న భాస్కర్ నాయుడు

ట్రిపుల్ ఐటీకి ఎంపిక




ప్రజాశక్తి- రామకుప్పం: మండలం లోని చెల్దిగానిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి చతుర్నిక ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా పదవ తరగతిలో 564 మార్కులతో మంచి ఉత్తీర్ణత సాధించడంతో కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఎంపికైంది. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చతుర్నికను అభినందించారు.

పిచ్చికుక్క వీరంగం

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ గంగిరెడ్డి పురం, ఎర్ర నాగులవారిపల్లి, మేటిమంద గ్రామాల్లో శనివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. పిల్లలు, పెద్దలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. వారిని స్థానికులు పీలేరు, తిరుపతి, పుంగనూరు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇండ్ల వద్ద, దారిలో వెళుతున్న వారిని, పొలం వద్ద పనిచేసుకుంటున్న వారిపై తీవ్రంగా దాడిచేసినట్లు స్థానికులు చెబుతున్నారు. చెవులు, చేతులు, కాలి పిక్కలపై కరవడంతో వారికి గాయాలైనట్లు సమాచారం.


సహపంక్తి భోజనానికి హాజరైన ఎమ్మెల్సీ



ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి అటవీ శివర్లలోని కృష్ణమ్మ ఆలయం వద్ద శ్రావణ శనివారం పూజలు గ్రామస్తులకు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ కలిసి వనభోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. అందరితో కలిసి వనభోజనం చేశారు. కృష్ణమ్మ అమ్మవారికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, చిన్ని కృష్ణ, నందా రెడ్డి, బాబు, రఫీ, భాస్కరాచారి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: మండలంలోని ఉడమలకుర్తి పంచాయతీకి చెందిన పివి పురం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా దారి తగాదాలు ఉన్నాయి. దారి తగాదాపై ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కి పివిపురం గ్రామానికి చెందిన రైతులు అప్పలరాజు, నీలమ్మలు ఫిర్యాదు చేశారు. శనివారం తహశీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో మోహన మురళి, ఎస్ఐ సుమన్ కలిసి గ్రామానికి వెళ్లి ఫిర్యాదు దారులను విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక ను అందించి పరిష్కార మార్గాన్ని చూపుతామని తెలిపారు.



పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి: పీడీ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణంలో ఉపాధి హామీ పనులపై పీడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఇప్పటి వరకు జరిగిన పనులు ఖర్చు పెట్టిన మొత్తాలు లెక్కించి రూ.44,568 రికవరీకి ఆదేశించారు. రాయలపేట, పెద్దవెలగటూర్, అప్పినపల్లి, కొళత్తూరు పంచాయతీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లును విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఓ గంగాభవాని, ఈపిడి రవికుమార్, ఏపీవో రెడ్డమ్మ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు
భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు : టీటీడీ ఈవో



ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, పురటాసి మాసం కూడా వస్తున్నందువల్ల భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. అన్నివిభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంలతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో అక్టోబరు 4న ధ్వజారోహణం ఉంటుందని, అదేరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. గరుడవాహనసేవ సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమవుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేయడం జరిగింది. సుమారు ఏడు లక్షల లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడం జరుగుతుంది. టిటిడి నిఘా, భద్రతా సిబ్బంది, జిల్లా పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు. గరుడసేవకు ప్రత్యేకంగా అదనపు భద్రత, నిత్యం కామన్ కమాండ్ సెంటర్ ద్వారా భద్రత పర్యవేక్షణ, వార్షిక బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుమల, తిరుపతిలలో పలు ఇంజినీరింగ్ పనులు చేస్తున్నామన్నారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలంకరణలు, వాహనసేవలు వీక్షించేందుకు మాడ వీధుల్లో గ్యాలరీలు, పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు కాటేజీ దాతలకు గదుల కేటాయింపు ఉండదని, తిరుమలలో గదుల లభ్యత తక్కువగా ఉన్నందున, తిరుమలలో గదులు లభించని భక్తులు తిరుపతిలో బస చేయాలని కోరుతున్నామన్నారు. కల్యాణకట్ట, ఇతర మినీ కల్యాణకట్టలలో క్షురకులు నిరంతరాయంగా భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి, అదనపు సిబ్బంది ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లలో అన్నప్రసాదం, పాలు, అల్పాహారం వితరణ, తిరుమలలోని అశ్విని ఆసుపత్రి, వైకుంఠం క్యూకాంప్లెక్సుల్లోని వైద్య కేంద్రాలు, డిస్పెన్సరీలతో పాటు పలు ప్రథమ చికిత్స కేంద్రాలు, మొబైల్‌క్లినిక్, అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 4,000 మంది శ్రీవారి సేవకులు, తిరుమలలోని అన్ని విభాగాల్లో భక్తులకు సేవలందిస్తారని, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా వాహనసేవల ప్రత్యక్ష ప్రసారం, ఫోటో ఎగ్జిబిషన్, ఫలపుష్ప ప్రదర్శనశాల, ఆయుర్వేద, శిల్ప ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబరు 8న గరుడసేవ సందర్భంగా ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకల రద్దు చేయడమైనదని, అలిపిరి పాత చెక్‌పోస్టు, శ్రీవారిమెట్టు వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా, పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు చక్కటి సేవలందించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సిద్ధమవుతున్నాయని వివరించారు. అంతకు ముందు ఈవో ఇంజినీరింగ్ పనులు, అన్నప్రసాదం, దర్శనం, వసతి, పోలీసు, కళ్యాణకట్ట, రవాణా, హెచ్‌డిపిపి, ఉద్యానవనం, వైద్యం, ఆరోగ్యం, శ్రీవారి సేవకుల సమన్వయంతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సివి అండ్ ఎస్వో శ్రీధర్, ఎఫ్ఎసిఏవో బాలాజి, సిఈ నాగేశ్వరరావు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, వివిధ శాఖాధిపతులు, పాల్గొన్నారు.